## క్రీడలకు అధిక ప్రాధాన్యం

**- గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల డిప్యూటీ డైరెక్టర్ సంధ్యారాణి**



బోయిన్‌పల్లిలోని ప్లే గ్రౌండ్‌లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, వసతిగృహ విద్యార్థులకు డివిజినల్ లెవెల్ గేమ్స్ సెలెక్షన్స్‌ను నిర్వహిస్తున్న అధికారులు

కంటోన్మెంట్, అక్టోబర్ 3: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, వసతి గృహ విద్యార్థులకు డివిజినల్ లెవెల్ గేమ్స్ సెలెక్షన్స్ మంగళవారం న్యూ బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల డిప్యూటీ డైరెక్టర్ సంధ్యారాణి, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్‌లు ముఖ్య అతిథులుగా హాజరై సెలక్షన్ పోటీలను ఆరంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ ఎనిమిది క్రీడల్లో డివిజనల్ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నామని ప్రతిభ కనబరచిన క్రీడాకారులను జోనల్ స్థాయిలో ఎంపిక చేస్తామన్నారు. అనంతరం జంపన ప్రతాప్ మాట్లాడుతూ కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరంతరం క్రీడలను క్రీడాకారులను ప్రోత్సహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జగదీష్, గిరిజన బాలుర వసతి గృహం వార్డెన్ లల్లూ, జంపన రవి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబర్చిన ఎన్‌సీసీ క్యాడెట్లకు అభినందన



ప్రతిభ కనబర్చిన ఎన్‌సీసీ క్యాడెట్లతో ఏయిర్ కమాండోర్ వీఎంరెడ్డి

కంటోన్మెంట్, అక్టోబర్ 3: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల్లో ఎన్‌సీసీని మరింత బలోపేతం చేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఏయిర్ కమాండోర్ వీఎం రెడ్డి పేర్కొన్నారు. సెప్టెంబర్ 19 నుంచి 30 వరకు ఢిల్లీలోని కరియప్ప పెరేడ్ మైదానంలో జరిగిన థాల్ సైనిక్ క్యాంప్‌లో ఆంధ్రా, తెలంగాణకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రతిభ కనబర్చారు. మ్యాప్ రీడింగ్, ఫీల్డ్ సిగ్నల్స్, జడ్జింగ్ డిస్టెన్స్, అబ్స్టాకిల్ ట్రైనింగ్, టెన్స్ పిచింగ్ తదితర విభాగాల్లో 51 మంది సభ్యులున్న బాలుర బృందం ద్వితీయ స్థానంలో నిలవగా, బాలికల బృందం నాలుగో స్థానంలో నిలిచింది. అలాగే ఇంటర్ డైరక్టరేట్ సర్వీస్ షూటింగ్‌లో మొదటి స్థానంలో నిలిచినట్లు ఎయిర్ కమాండోర్ వీఎం రెడ్డి తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 17 ఎన్‌సీసీ క్యాడెట్ బృందాలు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

## ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

మల్కాజిగిరి, అక్టోబర్ 3: ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం చంద్రపురంకాలనీలో అధికారులతో కలసి కార్పొరేటర్ పాదయాత్రచేసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలను ఏర్పాటు చేస్తామని అన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి తదితరులు



నూతన సీవరేజ్ డీ సిల్టింగ్ వాహనాలను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్, డిప్యూటీ మేయర్ తదితరులు

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 3: తార్నాక డివిజన్‌లోని పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డి, బీఆర్‌ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డిలతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ ప్రజా అవసరాలకు అనుగుణంగా ప్రజలకు సదుపాయాలను కల్పించేందుకు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా వివిధ కీలక ప్రాజెక్టులను సికింద్రాబాద్ నియోజకవర్గంలో చేపట్టినట్లు పేర్కొన్నారు. రూ.13.05 కోట్ల ఖర్చుతో లాలాపేట నూతన ప్రభుత్వ ఆస్పత్రి భవనం నిర్మిస్తున్నామన్నారు. రూ.6.99 కోట్లతో కళ్యాణమండపం, రూ.ఆరు కోట్లతో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో స్విమ్మింగ్‌పూల్ నిర్మాణం పనులను ప్రారంభించినట్లు తెలిపారు. నాగార్జుననగర్‌లో కొత్త బస్తీ దవాఖాన, రూ.25 లక్షలతో పార్కులో అభివృద్ధి పనులు, రూ.50 లక్షలతో సీవరేజీ, మంచినీటి పైపులైన్, రూ.22 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించినట్లు వివరించారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి దళిత బంధులో భాగంగా కేటాయించిన 7 సీవరేజ్ డీ సిల్టింగ్ వాహనాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసురి సునీత, బీఆర్‌ఎస్ యువనాయకులు కిశోర్‌కుమార్, రామేశ్వర్‌గౌడ్, త్రినేత్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కులగణన చేస్తేనే లెక్కలు తేలుతాయి




సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్ రాములు

ఖైరతాబాద్, అక్టోబర్ 3 : దేశంలోనే అత్యధిక జనాభా కలిగిన బహుజనుల లెక్క తేలాలంటే కుల గణన తప్పని సరి అని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు అన్నారు. భారతీయ ఓబీసీ సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ జనాభాలో 60 శాతానికి పైగా బీసీలు ఉంటే, ఎస్సీ, ఎస్టీలు కలిసి మొత్తం 87 శాతం ఉంటారన్నారు. కుల గణన చేయకపోవడం వల్ల చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం లభించడం లేదన్నారు. భారతీయ ఓబీసీ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు కె. కోటేశ్వర్ రావు మాట్లాడుతూ ఓబీసీల జనాభా లెక్కల కోసం ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులు రాందాస్ అతవాలే, గంగారంలను కలిశామని, వారు మద్దతునిస్తామని చెప్పారన్నారు. త్వరలోనే అన్ని పార్టీల అధినేతలను కలిసి కుల గణనకు మద్దతు ఇవ్వాలని కోరుతామన్నారు.
ఈ సమావేశంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎం. సుబ్రహ్మణ్యం, ఎం. పురుషోత్తం, అబ్దుల్ షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు రెండో స్థానం

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 3 : తెలంగాణ స్కూల్ గేమ్స్ అండర్–19 జూనియర్ కాలేజీ బాలుర ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జిల్లా జట్టు రెండో స్థానంలో నిలిచింది. సంగారెడ్డి జిల్లా సదాశివపేట్‌లో సోమవారం ముగిసిన ఫైనల్ మ్యాచ్‌లో మెదక్ జిల్లా జట్టు చేతిలో 3–2 స్కోరుతో ఓడిపోయి రెండో స్థానంలో నిలిచింది. హైదరాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి ఒడెన్న, జూనియర్ కాలేజి గేమ్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ బాలరాజు జట్టు సభ్యులను అభినందించారు.



విజేత జట్టును అభినందించిన అధికారులు

## ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు గిరిజన శక్తి విజయం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 3: రాష్ట్రంలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించడం గిరిజన శక్తి సాధించిన విజయంగా ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు శరత్‌నాయక్ అభివర్ణించారు. ఐదేళ్లుగా ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఉద్యమించినట్లు గుర్తు చేశారు. వర్సిటీ ఏర్పాటు ప్రకటనతో శరత్‌నాయక్‌ను ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో పలువురు అధ్యాపకులు, విద్యార్థి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శరత్‌నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ మంగునాయక్, తూటా ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రొఫెసర్ రాజు పాడియా, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బాలునాయక్, జెనెటిక్స్ ప్రొఫెసర్ విజయ్‌నాయక్, విద్యార్థి నాయకులు రమేశ్ రాథోడ్, డాక్టర్ రాజారాంనాయక్, విజయ్‌నాయక్, నందునాయక్, నరేశ్‌నాయక్, శివాజీ నాయక్, బాసునాయక్, నవీన్‌నాయక్, ప్రేమ్‌సింగ్‌నాయక్ పాల్గొన్నారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, అక్టోబర్ 3: రైలు ఢీ కొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఘట్‌కేసర్–బీబీనగర్ రైల్వే స్టేషన్ల మధ్య మంగళవారం ఉదయం 9:30 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్

మల్కాజిగిరి, అక్టోబర్ 3: నాయకులకు, కార్యకర్తలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ కంటోన్మెంట్, మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం అల్వాల్ సర్కిల్ బీఆర్‌ఎస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ క్యాడర్‌కు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. మారుతున్న రాజకీయ పరిణామాలతో కూడా పార్టీ చెక్కుచెదరలేదని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటే నాయకులు, కార్యకర్తలు ఉన్నారన్నారు.





హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేసిన గణేశ్ విగ్రహాల వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం